ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 1 అక్టోబరు 2025





ఆటో డ్రైవర్లకు భరోసా

జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి!

- మొత్తం 15,237 మంది దరఖాస్తు
- 14,719 మంది అర్హులుగా గుర్తింపు
- నాలుగో తేదీన 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం
- ఒక్కో డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ

అనకాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ప్రభుత్వం ఆటోలు, క్యాబ్ డ్రైవర్ల కోసం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని అమలు చేయనున్నది. అర్హులైన వారికి ఏటా రూ.15 వేల చొప్పున నగదు సాయం అందిచనున్నది. 'స్త్రీ శక్తి' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడంతో తమకు ఆదాయం తగ్గిపోయిందని, ఆర్థికంగా ఆదుకోవాలన్న ఆటో డ్రైవర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. తొలుత అక్టోబరు 2వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించాలని భావించారు. కానీ సాంకేతిక కారణాలతో అక్టోబరు 4వ తేదీకి వాయిదా వేశారు. అదే రోజు అర్హులైన్న డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల చొప్పున ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపికను జిల్లా రవాణా శాఖ అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. మొత్తం 15,237 మంది దరఖాస్తు చేసుకోగా,



క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం 14,719 మందిని అర్హులుగా తేల్చారు. అత్యధికంగా అనకాపల్లిలో 1,060 మంది ఈ పథకానికి ఎంపికయ్యారు. అచ్యుతాపురం మండలంలో 804 మంది, బుచ్చెయ్యపేట మండలంలో 541 మంది అర్హత సాధించగా, ఎలమంచిలి మండలంలో అత్యల్పంగా 198 మంది మాత్రమే ఈ పథకానికి ఎంపికయ్యారు. అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే... సచివాలయాల్లో మరోసారి దరఖాస్తు చేసుకొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కొత్తగా ఆటోలు కొనుగోలు చేసిన వారు సైతం ఈ పథకం కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

దుర్గాదేవి అవతారంలో అమ్మవారు

చోడవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గముడనే రాక్షసుడిని సంహరిస్తున్నట్టుగా అమ్మవారి చేతుల్లో పలు రకాల ఆయుధాలతో విగ్రహాలను అలంకరించారు. వీధుల్లో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల మండపాల్లో కూడా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. చోడవరం పాతబస్టాండ్ ఆవరణలోని ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర (వెయ్యి) నిమ్మకాయలతో అలంకరించి హోమం, విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలు భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మందకొడిగా డిగ్రీ ప్రవేశాలు

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో సగానికిపైగా సీట్లు ఖాళీ



ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- నర్సీపట్నం, ఎలమంచిలి, నక్కపల్లి, సబ్బవరం కళాశాలల్లో ఒకింత మెరుగు..
- మాడుగుల కళాశాలలో అధ్వానం
- మొదటి విడత కౌన్సెలింగ్‌లో 17.3 శాతం సీట్లు మాత్రమే భర్తీ
- రెండో విడత ప్రవేశాలకు 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్
- 10న సీట్ల కేటాయింపు, 13లోగా కళాశాలలో రిపోర్ట్

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)
జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు మందకొడిగా సాగుతున్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్ ఇప్పటికే పూర్తికాగా.. మొత్తం మీద సగం సీట్లు కూడా భర్తీ కాలేదు. నర్సీపట్నం, ఎలమంచిలి, నక్కపల్లి, సబ్బవరం కళాశాలల్లో ప్రవేశాలు ఒకింత మెరుగ్గా వున్నాయి. చోడవరంలో సగానికిపైగా సీట్లు ఖాళీగా వున్నాయి. మాడుగుల కళాశాలలో 17.3 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇంటర్ పరీక్షలు ఫలితాలు విడదల కాగా, ఉన్నత విద్యాశాఖ అధికారులు సెప్టెంబరు వరకు డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్లు చేపట్ట లేదు. దీంతో పలువురు విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల్లో చేరారు. ఈ కారణంగానే మొదటి విడత కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు చాలా వరకు మిగిలాయి. కాగా రెండో విడత అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో అక్టోబరు మూడో తేదీ



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆరో తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువు వుంది. 10వ తేదీన సీట్లు కేటాయిస్తారు. 13వ తేదీలోగా విద్యార్థులు తమకు సీటు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాల్సి వుంటుంది.

నర్సీపట్నంలో 55 శాతం సీట్లు భర్తీ

నర్సీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఉన్నత విద్యాశాఖ నర్సీపట్నంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ఫస్టియర్‌లో 300 సింగిల్ మేజర్ సబ్జెక్టు సీట్లు కేటాయించింది. ఆయా కోర్సుల్లో చేరడానికి మొదటి విడత కౌన్సెలింగ్‌లో 191 మంది దరఖాస్తు చేసుకోగా 165 సీట్లు భర్తీ అయ్యాయి. బీఏ హిస్టరీలో 40 సీట్లకుగాను 26 మంది ప్రవేశం పొందారు. బీఏ పొలిటికల్ సైన్స్‌లో 40 సీట్లకు ఏడుగురు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లకు 37 మంది చేరారు. బీఎస్సీ బోటనీలో 40 సీట్లకు 27 మంది, బీఎస్సీ కెమిస్ట్రీ 40 సీట్లకు 23 మంది, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 40 సీట్లకు 38 మంది, బీఎస్సీ ఫిజిక్స్ 40 సీట్లకు ఏడుగురు మాత్రమే చేరారు. ఏటా సెప్టెంబరు చివరినాటికి మూడో విడత అడ్మిషన్లు పూర్తయ్యేవి. కానీ ఈ ఏడాది ఇంతవరకు ఒకసారి మాత్రమే కౌన్సెలింగ్ జరిగింది. గత విద్యా సంవత్సరంలో 300 సీట్లకుగాను 264 సీట్లు భర్తీ అయ్యాయి.

నక్కపల్లిలో బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌కు ఆదరణ

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో బీఎస్సీ, బీఏ, బీకాం కోర్సుల్లో 235 సీట్లు వున్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 150 సీట్లు భర్తీ అయ్యాయి. బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ ... మిగతా 6వ పేజీలో

నేడు సీఎం ట్రాన్సిట్ హాల్ట్

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి):
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం విజయనగరం జిల్లా పర్యటనకు వెళుతూ కొద్దిసేపు విశాఖ విమానాశ్రయంలో ఆగనున్నారు. దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో దత్తి గ్రామానికి బయలు దేరి వెళతారు. కార్యక్రమం ముగిసిన తరువాత అక్కడ నుంచి నేరుగా ఉండవల్లి వెళతారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులు విడుదల

అనకాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో అక్టోబరు నెలకు సంబంధించి 2,57,322 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.108.63 కోట్లు విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది బుధవారం ఉదయం నుంచి పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేస్తారు.

ప్రత్యేక రైలు వెలవెల

అనకాపల్లి నుంచి సికింద్రాబాద్ వెళ్లే సర్వీసులో అంతంత మాత్రంగానే ప్రయాణికులు

- ఏసీ బోగీలు పూర్తిగా ఖాళీ
- ప్రచార లోపంతోపాటు అనకాపల్లి నుంచి నడపడమే కారణమన్న అభిప్రాయం



ఖాళీగా ఉన్న ఏసీ బోగీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :
దసరా పండుగ రద్దీనిఇ దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్-అనకాపల్లి మధ్య ప్రవేశ పెట్టిన ప్రత్యేక రైలుకు స్పందన కొరవడింది. 07059 నంబరుతో ప్రతి సోమవారం సాయంత్రం సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం అనకాపల్లికి చేరుతుంది. 07060 నంబరుతో ప్రతి మంగళవారం సాయంత్రం అనకాపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం సికింద్రాబాద్‌కు చేరుతుంది. మంగళవారం ఉదయం 22 బోగీలతో అనకాపల్లి వచ్చిన రైలు, సాయంత్రం 5.35 గంటలకు తిరిగి ఇక్కడి నుంచి బయలుదేరింది. అయితే ఏ బోగీలో కూడా పట్టుమ పది మంది ప్రయాణికులు కూడా లేరు. ఏసీ బోగీలు పూర్తిగా ఖాళీగా కనిపించాయి. సెకండ్ క్లాస్ జనరల్, స్లీపర్ కోచ్‌లలో మాత్రమే విజయవాడ వెళ్లే భవానీ మాలధారులు కనిపించారు. ప్రత్యేక రైలు సర్వీసుపై తగిన ప్రచారం చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పైగా విశాఖపట్నం నుంచి కాకుండా అనకాపల్లి నుంచి నడపడం కూడా ఒక కారణమని అంటున్నారు.

అనకాపల్లిలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం



పూడిమడక రోడ్డు జంక్షన్‌లో జాతీయ రహదారి వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పూడిమడకరోడ్డు జంక్షన్‌లో హైవేకు ఇరువైపులా, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ ఎప్పటి మాదిరిగానే చెరువును తలపించింది. ఎస్.రాయవరం మండలంలో సుమారు గంటన్నరపాటు కుండపోతగా వర్షం కురిసింది.

లంకెలపాలెం ప్రాంతంలో..

లంకెలపాలెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి లంకెలపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. లంకెలపాలెం-ఫార్మాసిటీ రహదారిలో ఏలేరు కాలువ వంతెన పైనుంచి నీరు పారింది. వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో మురుగు రహదారుల పైకి ప్రవహించింది.

గొలుగొండ మండలంలో..

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం పడుంది. గెడ్డలు, వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రహదారులపై గోతుల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



కృష్ణాదేవిపేటలో వర్షం



లంకెలపాలెంలో వర్షం

పుణ్యకోటి వాహనంపై పురుషోత్తముడు



పుణ్యకోటి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దేవదేవుని తిరువీధి సేవ కన్నుల పండువగా సాగింది. తొలుత ఆలయంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుణ్యకోటి వాహనంపై పురుషోత్తముడిని అధిష్ఠింపజేసి, మాడవీధుల్లో మంగళ వాద్యాల నడుమ ఊరేగించారు.

గోతుల్లో కూరుకుపోయిన వాహనాలు

- ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డుపైన గోతుల్లో కూరుకుపోయిన వాహనాలు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రహదారిలో మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్- డి.సురవరం మధ్య రోడ్డుపైన వున్న గుంతల్లో మంగళవారం ఉదయం రెండు వాహనాలు, సాయంత్రం ఒక వాహనం దిగబడిపోయాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి సరుగుడు కర్రల లోడుతో ట్రాక్టర్, వడ్డాది వైపు నుంచి నుంచి సరుగుడు కర్రల లోడుతో వ్యాన్ వస్తున్నాయి. డి.సురవరం వద్ద రెండు వాహనాలు ఎదురుపడిన చోట రోడ్డుపై ఉన్న గోతుల్లో కూరుకుపోయాయి. ఇరుక్కుపోయిన వాహనాల యజమానులు ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చి, బయటకు లాగించారు. దీంతో సుమారు గంటసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా సాయంత్రం ఐదు గంటల సమయంలో పాడేరు వెళుతున్న వ్యాన్ డి.సురవరం వద్ద అదే ప్రదేశంలో దిగబడిపోయింది. పక్క నుంచి స్థలం వుండడంతో వాహనాలు అతి కష్టంమీద రాకపోకలు సాగించాయి. ఎక్స్‌కవేటర్‌ను రప్పించి వ్యాన్‌ను బయటకు తీయించారు.



నిలిచిపోయిన వాహనాలు

చెరువులా 'పేట మెయిన్ రోడ్డు

- డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రహదారిపై నిలిచిపోతున్న వర్షం నీరు
- రాకపోకలకు పాదచారులు, వాహనదారుల ఇక్కట్లు

పాయకరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):
స్థానిక మెయిన్‌రోడ్డును రెండేళ్ల క్రితం అభివృద్ధి చేసిన అధికారులు... రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించకపోవడం, కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై నిలిచిపోతున్నది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మెయిన్‌రోడ్డుపై పలుచోట్ల నీరు నిలిచిపోయి చెరువులను తలపించింది. వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నీరు ప్రవహించడం,



గౌతమ్ థియేటర్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు




లక్ష్మి థియేటర్ ఎదుట చెరువును తలపిస్తున్న మెయిన్‌రోడ్డు

ఎక్కువసేపు నిలిచి వుండడంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు త్వరగా పాడైపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రహదారికి ఇరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్న వారు తమ దుకాణాల ఎదుట వర్షం నీరు నిలవకుండా వుండేందుకు మట్టి, గ్రావెల్, భవనాల వ్యర్థాలతో ఎత్తు చేసుకున్నారు. దీంతో రోడ్డుపై కురిసిన వర్షం నీరు ఎటూ వెళ్లలేక రోడ్డుపైనే నిలిచిపోతున్నది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షానికి మెయిన్‌రోడ్డులో గౌతమ్, శ్రీలక్ష్మి థియేటర్ ఎదుట వర్షపునీరు నిలలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

- అరటి తోటలో పని చేస్తుండగా ఘటన

మునగపాక, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి):
మండల కేంద్రంలో ఒక మహిళ పాముకాటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. మునగపాకకు చెందిన వేగి ఆదిలక్ష్మి (51) మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లారు. అక్కడ అరటి తోటలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. కొద్దిసేపటి తరువాత పొలా నికి వెళ్లిన పెద్ద కుమారుడు నాగేశ్వరరావు.. అపస్మారకస్థితిలో పడి వున్న తల్లిని చూసి ఆందోళన చెందాడు. నోటి నుంచి నురగ రావడం, కాలిపై పాము కాట్లు కనిపించడంతో వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు చెప్పారు. ఆదిలక్ష్మి భవానీ దీక్షలో ఉన్నారు. జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా వున్న ఆదిలక్ష్మి మృతిచెందడం బాధాకరమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం అన్నారు.



వేగి ఆదిలక్ష్మి (ఫైల్ ఫొటో)

లాభాల బాటలో సహకార సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నూక నర్సింగరావు

మునగపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లాభాల బాటలో నడుస్తోందని సొసైటీ చైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు అన్నారు. సహకార ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6739 మంది సభ్యులు ఉన్న సొసైటీ రూ.36.28కోట్లు మేర డిపాజిట్లు, రూ.32.85లక్షలు షేర్ ధనం ఉందని చెప్పారు. జాతీయ బ్యాంకులకు దీటుగా లావాదేవీలు కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా సభ్యుల సూచన మేరకు మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు అంత్యక్రియలకు రూ.10 వేలు పెంచామని తీర్మానం చేశారు. త్రిసభ్య కమిటీ చొరవ తీసుకుని అమల్లోకి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో మొల్లి అప్పలరాజు, పాలిపిని రామారావు, జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పూర్వపు అధ్యక్షుడు దాడి మునిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ నాయకులకు, కార్యకర్తలకు రక్షణ కవచంలా ఉంటుందని పార్టీ నేతలు అన్నారు. రాంబిల్లిలో మంగళవారం డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను, అరాచకాలను పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తించి, వాళ్లలో ధైర్యాన్ని నింపేందుకు డిజిటల్ బుక్‌ను రూపొందించారని అన్నారు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఉన్న సమస్యలను నేరుగా జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిశోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీను బాబు, జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ ప్లకార్డుల ప్రదర్శన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు,

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట కేంద్రంగా బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ చేపడుతున్న నిరసన దీక్షలో మంగళవారం వైసీపీ నాయకులు పాల్గొని మత్స్యకారులకు సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైసీపీ నాయకులు సూరకాసుల గోవింద్, గొర్ల బాబూరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు నిరసన నినాదాలు చేపట్టారు.

'పంచాయతీ స్థలాలు స్వాధీనం చేసుకోవాలి'



గ్రీవెన్స్‌లో ఇచ్చిన రసీదు చూపుతున్న నాగరాజు

పాయకరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో సర్వే నం.170-2లో వేసిన లేఅవుట్లలో పంచాయతీ స్థలాలను గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్టు పాయకరావుపేటకు చెందిన ముక్కుడుపల్లి నాగరాజు తెలిపారు. మంగళవారం వివరాలు తెలియజేస్తూ పాయకరావుపేటలోని రాజుగారిబీడును ఆనుకుని ఉన్న సర్వే నం.170-2లోని వివిధ ఖాతాలకు చెందిన సుమారు 4 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో ప్రజోపయోగం కోసం పంచాయతీకి కేటాయించిన స్థలాలు క్రయవిక్రయాలు జరిగిపోయాయని ఆరోపించారు. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా సర్వే నం.170-2కి సంబంధించి తమవద్ద ఎటువంటి రికార్డులు లేవని తెలిపారన్నారు. దీనిపై పూర్తి విచారణచేసి పంచాయతీకి కేటాయించిన స్థలాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశానన్నారు. పట్టణంలో పీఆర్ గెస్టుహౌస్ ఎదుట ఉన్న సర్వే నం.132/2బిలో 1985లో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన 520 గజాల్లో సగం స్థలం అన్యాక్రాంతమైందని, దీనిపై పూర్తి విచారణ జరిపి పంచాయతీకి చెందిన రూ.కోట్ల విలువైన 520 గజాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని వినతిపత్రం అందజేశామని పట్టణానికి చెందిన ఐ.ఎస్.మూర్తి తెలిపారు.

ఉద్యోగ సాధకులకు సన్మానం



ఉద్యోగాలు పొందినవారిని పీకేపల్లిలో సన్మానించిన గ్రామస్థులు

కోటవురట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించిన కోటవురట్ల మండలం పీకేపల్లి వాసులు ముగ్గురిని యువనాయకుడు రొంగల రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మెగా డీఎస్సీకి ఎంపికైన ఎస్.నరిసింహమూర్తి, ఆర్.దేవుడునాయుడు, ఎస్.నాగేశ్వరరావులను ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పెద్దలు ఘనంగా సత్కరించారు. వీరితోపాటు వివిధ శాఖలలో కొత్తగా ఉద్యోగాలు పొందిన ఎస్.అక్షిత, వై.రాజుబాబు, ఆర్.శివరామ్‌లను కూడా సన్మానించారు. యువకులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని గ్రామపెద్దలు సూచించారు.

వైస్ ఎంపీపీ ఈశ్వరరావుకు పాముకాటు



చికిత్స పొందుతున్న వెలగా ఈశ్వరరావు

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు పాముకాటుకు గురయ్యారు.చినదొడ్డిగల్లులోని తన నివాసంలో వున్న సమయంలో మంగళవారం వైస్ ఎంపీపీ ఈశ్వరరావును పాము కాటేసింది. ఇది గమనించిన ఆయన కుటుంబసభ్యులకు తెలియజేశారు. హుటాహుటీన నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ఏఎస్‌వీ వ్యాక్సిన్లు, ఇతర వైద్యసేవలందించారు.ప్రస్తుతం ఈశ్వరరావు ఆరోగ్యం బాగానే వుందని వైద్యులు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీనేత వీసం రామకృష్ణ,గొర్ల గోవింద్ తదితరులు పాముకాటుకు గురైన వైస్ ఎంపీపీని పరామర్శించారు.

జగన్మాతకు సామూహిక పూజలు



దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



దిమిలి అయ్యప్పస్వామి ఆలయంలో చండీహోమం



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



అమ్మవారి హారతి తీసుకుంటున్న మాజీ పార్లమెంట్ సభ్యుడు పప్పల చలపతిరావు

అచ్యుతాపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలోని పిట్లపాలెం, అప్పన్నపాలెంలో మంగళవారం దుర్గాదేవికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న నేతలు

అచ్యుతాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం, అందలాపల్లి గ్రామాల్లో కొలువైన శ్రీ విజయదుర్గ, శ్రీభగీరథ అమ్మవార్లను స్థానిక టీడీపీ, వైసీపీ నేతలు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ పార్లమెంట్ సభ్యుడు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీలా తులసీరాం, కాద్రేగుల అప్పారావు అమ్మవార్లకు పూజలు చేశారు. అలాగే ఎలమంచిలి నియోజకవర్గ వైసీపీ మాజీ శాసన సభ్యుడు యూవీ.రమణమూర్తి రాజు, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, హరిపాలెంలో కనకదుర్గ అమ్మవారిని, అందలాపల్లిలో భగీరథ అమ్మవారిని పార్టీ నేతలుతో కలిసి దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం

రాంబిల్లి, (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దిమిలి గ్రామంలో అయ్యప్పస్వామి, మణికంఠ ఆలయంలో చండీహోమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'జై దుర్గమ్మ' అంటూ భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు

ఎలమంచిలి, (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం భవానీ భక్తులు అమ్మవారి ఘటాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ద్వారకానగర్ నుంచి అమ్మవారి ఆలయానికి ఘటాలు ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు.

దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి

దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో శ్రీ వాసవీ కూచిపూడి డాన్స్ అకాడమీ అదేపల్లి శ్రీవల్లీ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా వరమహాలక్ష్మి అమ్మవారు



చిట్టూరి మెట్రోలో దుర్గామాతకు అలంకరణ

పాయకరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసి ఉన్న శ్రీవైకుంఠ నారాయణ సహిత వరమహాలక్ష్మి అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి కుంకుమ పూజ, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బోయపాడులో సామూహిక పూజలు

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి పర్వదినం సందర్భంగా మంగళవారం బోయపాడు లోని దుర్గాదేవి మందిరం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.బోయపాడు దుర్గా భవానీ దీక్షాపరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళలు మందిరానికి వచ్చి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉపమాక గురుభవానీ దవరసింగి రాంబాబు మహిళలతో కుంకుమపూజలు చేయించారు. అందరూ ఒకేసారి సామూహికంగా అమ్మవారికి హారతులిచ్చారు. గురుభవానీ అప్పలరాజును ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, దీక్షల వెనుక వున్న పరమార్థాన్ని తెలుసుకుని, మూఢనమ్మకాలను వీడాలని గురుభవానీ రాంబాబు సూచించారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

జీఎస్టీ తగ్గింపుతో పేద కుటుంబాలకు రూ.15వేల ఆదా

» రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జీఎస్టీ విధానంలో తీసుకువచ్చిన నూతన సంస్కరణలతో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు రూ.15వేలు వరకూ ఆదా అవుతుందని, దీంతో ప్రజలు ఆనందంగా ఉన్నారని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండంలోని పురుషోత్తపురం గ్రామంలో ముఖ్య నాయకులు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి వస్తువులపై జీఎస్టీ తగ్గించి. 2 పన్ను లశ్లాబ్‌లు మాత్రమే ఉండేలా చేయడం గొప్ప విషయమన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజారంజకంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు. అనంతరం లక్కవరం పీఏసీఎస్ అధ్యక్షుడు కొలుకులూరి విజయ్ బాబు, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కారణంగా ప్రజల జీవన విధానం బాగుందన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, సెక్రటరీ ఆదిమూర్తి ఇతర నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాన సూర్య నాగేశ్వరరావు, దంట్ల వెంకటస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

మునగపాకలో

మునగపాక, (ఆంధ్రజ్యోతి): పేదోడికి గొప్పింటి జీవనం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ జీఎస్టీలో పలు సంస్కరణలు తీసుకువచ్చిందని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో జీఎస్టీతో అనేక వస్తువుల ధరలు తగ్గాయని అన్నారు. ఈ కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బొండా జగన్నాథం, తదితర నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

హాకీ మైదానాన్ని పరిశీలించిన డైరెక్టర్లు

నక్కపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు ఎంవీ రమణారావు, పేరం రవీంద్రనాథ్ ,కొవ్వాసు జగదీశ్వరిలతో కూడిన బృందం మంగళవారం నక్కప్లి హాకీ మైదానాన్ని పరిశీలించింది. నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్ ద్వారా శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో వారు ముచ్చటించారు. గతంలో అనేక మంది క్రీడాకారులు ఈ క్లబ్ నుంచి పలు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికయ్యారని, మరి కొందరు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబుచెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలన్న సంకల్పంతోనే హాకీ మైదానాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు చిన్న అప్పారావు, సెక్రటరీ కొల్నాటి తాతాజీ,సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, కోచ్‌లు రాంబాబు, నానాజీ, శ్రీను, రంజిత్ పాల్గొన్నారు.



హాకీ క్రీడాకాయులతో మాట్లాడుతున్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు

కోటవురట్లలో కుండపోత వర్షం

కోటవురట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలంలోని పలు గ్రామాల్లో వాతావరణంలో మార్పు కారణంగా కుండపోత వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో ప్రజలు సతమతమవుతున్న తరుణంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. వరిసాగుకు వరుణదేవుడు ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు. కురిసిన భారీ వర్షానికి మండలంలో గెడ్డలు, వాగులు ప్రవహించడంతో చెరువుల్లోకి సాగునీరు పుష్కలంగా చేరింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. ఈ వర్షానికి పంటపొలాల్లో నీళ్లు నిలిచిపోయాయి. కురుస్తున్న కుండపోత వర్షాలకు అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోటవురట్లలో వర్షానికి రహదార్లు జలమయమయ్యాయి. రామచంద్రపురం, గొట్టివాడ, కైలాసపట్నం, కోటవురట్ల, లింగాపురం, కె.వెంకటాపురం, తంగేడు గ్రామాల్లో భారీ వర్షాలు కురవడంతో రైతులు సాగునీటిపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.రాయవరం మండలంలో ఏకధాటిగా వర్షం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడున్నర గంటల సమయం నుంచి గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచింది. అంతేకాకుండా అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్దఎత్తున ఉన్న గోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో పాటు పలు గ్రామాల్లో రహదారులపై ఉన్న గోతులన్నీ నీటితో నిండటంతో ఆయా రోడ్డు మార్గాల్లో రాకపోకలు చేసిన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కోటవురట్లలో జలమయమైన ప్రధాన రహదారి

'పేట' రియల్టర్ల గుండెల్లో 'విజిలెన్స్' గుబులు



స్థానిక రాజుగారిబీడులో పంచాయతీ స్థలం చుట్టూ ఉన్న ప్రహరీగోడను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది(ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో అక్రమ లేఅవుట్లు, కమ్యూనిటీ స్థలాల ఆక్రమణలపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయనున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తాజాగా మరోమారు స్పష్టం చేయడంతో పలువురు రియల్టర్ల గుండెల్లో గుబులు ప్రారంభమైంది. నాలుగు దశాబ్దాలుగా పాయకరావుపేట పంచాయతీలో వేసిన లేఅవుట్లపై విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగితే పంచాయతీ అవినీతి డొంక బయటపడనుండగా, లేఅవుట్ భూముల లావాదేవీల వ్యవహారంలో పలువురు రాజకీయ నాయకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉండడంతో వారికి కూడా విజిలెన్స్ కాక తగలడం ఖాయంగా కనబడుతోంది. పాయకరావుపేట మేజరు పంచాయతీలో సుమారు 200 ఎకరాల్లో వేసిన సుమారు 60 లేఅవుట్లలో ప్రజోపయోగం కోసం కేటాయించిన కమ్యూనిటీ స్థలాలు నిబంధనల ప్రకారం సుమారు 20 ఎకరాలు ఉండాలి. అయితే పాయకరావుపేటలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నవారిలో అత్యధికులు పలుకుబడి ఉన్నవారు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కావడంతో ఇటీవల వరకు పనిచేసిన పంచాయతీ అధికారులు వీరి ఒత్తిడిలకు తలొగ్గి పలు లేఅవుట్లలోని కమ్యూనిటి స్థలాలను 5 శాతానికి తగ్గించగా అవికూడా చాలాచోట్ల పనికిరాని కోసు ముక్కలను కమ్యూనిటీ స్థలాలుగా కేటాయించడం జరిగింది. పైగా ఈ స్థలాలను పంచాయతీకి రికార్డుపరంగా దఖలు పర్చకపోగా పంచాయతీ సిబ్బంది కూడా వీటిని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో పట్టణంలో పలు కమ్యూనిటీ స్థలాలు అన్యాక్రాంతం అయిపోగా, పలు స్థలాలు క్రయవిక్రయాలు జరిగిపోయినట్టు ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో స్థానిక రాజుగారిబీడులో సర్వే నం.175, 176లలో గతంలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన కమ్యూనిటీ స్థలం చుట్టూ బయటి వ్యక్తులు దర్జాగా ప్రహరీగోడ నిర్మించిన విషయం పత్రికల ద్వారా బయటకు పొక్కడంతో స్పందించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలతో అప్పటి వరకు స్తబ్ధుగా ఉండిపోయి పంచాయతీ అధికారులు ఒక్కసారిగా తమ బాధ్యతలు గుర్తుకువచ్చినట్టు పంచాయతీ స్థలంలో ఆక్రమంగా నిర్మించిన ప్రహరీగోడ తొలగించి ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా పట్టణంలో పలు పంచాయతీ స్థలాలు అమ్మకాలు జరిగాయని ఫిర్యాదులు చేయడంతో మరోమారు స్పందించిన హోం మంత్రి పాయకరావుపేట పంచాయతీలో వేసిన మొత్తం లేఅవుట్లు, పంచాయతీ స్థలాల నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ ఎంక్వైరీ వేస్తున్నట్టు ప్రకటించిన విషయం కూడా తెలిసిందే. దీనికితోడు పాయకరావుపేట లేఅవుట్లలో పంచాయతీ స్థలాల బాగోతం కొత్తగా తమ దృష్టికి వచ్చినట్టుగా జిల్లా అధికారులు కూడా ఆదేశాలు జారీచేయడంతో గత కొద్దిరోజులుగా పంచాయతీ స్థలాల్లో బోర్డుల ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని పంచాయతీ అధికారులు చేపట్టిన విషయం కూడా తెలిసిందే. ఈనేపథ్యంలో రెండ్రోజుల క్రితం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నాయకులను విజయవాడకు పిలిపించుకుని గత కొద్ది రోజులుగా పాయకరావుపేటలో లేఅవుట్లకు సంబంధించి జరుగుతున్న పరిణామాలు, అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. వీటిపై ప్రతిపక్ష నాయకులు పార్టీపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నాయని, దీనివల్ల పార్టీ ప్రతిష్ట దెబ్బతీసే అవకాశం ఉన్నందున వాస్తవాలు ప్రజలకు తెలియజేసి నిజాయితీని రుజువుచేసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులకు సూచించారు. పంచాయతీ లేఅవుట్లలో జరిగిన అక్రమాలు వెలికితీసి పంచాయతీ స్థలాలను కాపాడేందుకు విజిలెన్స్ ఎంక్వైరీ వేస్తున్న విషయాన్ని నాయకులకు మరోమారు స్పష్టం చేశారు. దీంతో పాయకరావుపేట పంచాయతీలో అక్రమ లేఅవుట్లు వేసిన రియల్టర్ల గుండెల్లో రైళ్ళు పరిగెత్తడం ప్రారంభించాయి. త్వరలో చేపట్టనున్న విజిలెన్స్ ఎంక్వైరీ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడితే మాత్రం పాయకరావుపేట పంచాయతీలో ఇప్పటి వరకు జరిగిన లేఅవుట్లలో అవినీతి బాగోతం బయటపడుతుందని, అదేవిధంగా లేఅవుట్ భూముల క్రయవిక్రయాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రమేయం ఉన్న పలువురు రాజకీయ నాయకులకు కూడా విజిలెన్స్ కాక తగిలే అవకాశాలున్నాయని పలువురు భావిస్తున్నారు.


ట్రావెల్ బస్సును ఢీకొన్న ట్రాలర్



ట్రాలర్‌ను పక్కకు తీస్తున్న సహాయక సిబ్బంది

ఎలమంచిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ప్రైవేటు ట్రావెల్ బస్సును వెనుక నుంచి వస్తున్న ట్రాలర్ ఢీకొన్నది. ఈ ప్రమాదంతో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సు సాంకేతిక కారణాలతో పురుషోత్తపురం జంక్షన్ సమీపంలో ఆగిపోయింది. అదే మార్గంలో వస్తున్న ట్రాలర్, వెనుక నుంచి బస్సును ఢీకొన్నది. దీంతో రెండు వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయి, ట్రాఫిక్ స్తంభించింది. హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పక్క మార్గంలోకి వాహనాలను మళ్లించారు. ఎక్స్‌కవేటర్‌ను రప్పించి, ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించారు.

తనువుచాలించిన తోడుపెద్దు



తోడుపెద్దు మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకు వెళుతున్న గ్రామస్థులు

మునగపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్నకు ప్రతిరూపంగా గ్రామీణ ప్రజలు తోడు పెద్దులను ఆరాధిస్తుంటారు. మండల కేంద్రం మునగపాకలో 13 ఏళ్లగా తోడుపెద్దుగా పూజలందుకుంటున్న జగ్గప్పగారి తోడుపెద్దు(కర్రిఎద్దు) సోమవారం అర్ధరాత్రి తనువు చాలించింది. 13ఏళ్ల క్రితం అప్పటి తోడుపెద్దు తనువు చాలించడంతో రెండు సంవత్సరాల వయసున్న కర్రిఎద్దును తోడుపెద్దు చేసి పూజలు చేయడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి గ్రామంలో జరిగే శుభకార్యాలకు గ్రామస్తులు పూజలు చేసేవారు. ఇప్పటి వరకు పూజలందుకున్న తోడుపెద్దు మృతి చెందడంతో గ్రామస్తులు ఆవేదనకు గురైయారు. ఈ సందర్భంగా తోడుపెద్దు మృతదేహాన్ని ఎడ్లబండిపై ఉంచి మంగళవారం ఊరేగించారు. అనంతరం నందీశ్వర ప్రాంగణం వద్ద పానుపు చేశారు.

అధికలోడ్ వాహనానికి రూ.67 వేల జరిమానా

మునగపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అధికలోడ్‌తో వెళ్తున్న లారీని మునపాక మెయిన్‌రోడ్డుపై పట్టుకుని రూ.67వేల జరిమాన విధించామని ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా అధిక లోడుతో ఉన్న లారీని గుర్తించామన్నారు. హెచ్చరిక బోర్డులు పెట్టినా కొంత మంది డ్రైవర్లు అసలు లెక్క చేయడం లేదని అన్నారు. లారీని అదుపులోకి తీసుకుని వివరాలను ఆర్టీవో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా జరిమానా విధించారని తెలిపారు.





పరమేశ్వరి పార్కు జంక్షన్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న బుద్ద... నవదుర్గమ్మ అలంకరణలో కన్యకాపరమేశ్వరి... పరవాడలోని దుర్గమ్మ మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలు, మండపాల్లో మంగళవారం నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. నూకాంబిక అమ్మవారి ఆలయంలోని మండపంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విరాళదాతల సహకారంతో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సహాయ కమిషనర్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను చర్యలు చేపట్టారు. సతకంపట్టులోని దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు బి.వెంకటరమణ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. బుద్ద నాగదీశ్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు నవదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు పూజలు చేశారు. కామాక్షిదేవి, గౌరీ పంచాయతన ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్ధినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పలు రకాల పిండి వంటలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బీఆర్ రామసత్యనారాయణ, కోశాధికారి ఎస్.జగదీశ్ పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలోన సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

తుమ్మపాలలో...

తుమ్మపాల: తుమ్మపాల పంచాయతీ వాటర్‌వర్క్సు వద్ద శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం కనకదుర్గమ్మ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారణ భక్తులు భజనలతో అమ్మవారి నామాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అంగులూరి రాము, నంద్యాల నానాజీ, అంగులూరి రాజేశ్, జె.రమేశ్, మురళీ, ఎల్.రఘురామ్ పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి దర్శించుకున్నారు. అలాగే భరణికం, రావాడ, దేశపాత్రునిపాలెం, కలపాక, తానాం, వెన్నెలపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల్లో దుర్గాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం: జీవీఎంసీలోని లంకెలపాలెం దుర్గమాంబ ఆలయంలో అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుందపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదముషిడివాడ, గండివానిపాలెం, సాలాపువానిపాలెం, శ్రీరామ్‌నగర్, మంత్రిపాలెం, కన్నూరు గ్రామాల్లో దుర్గాదేవి ప్రత్యేక పూజలు చేశారు.

సత్యనారాయణపురంలో వ్రతాలు

కొత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం పంచాయతీలోని కళ్యాణగిరిపై దుర్గమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు సామూహిక వృతాలు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టార. ఈ సందర్భంగా దుర్గాష్టమి పూజలను వైభవంగా నిర్వహించారు. సామూహిక వ్రతాలు, పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీంతో ఆలయం భక్తులు, భవానీ మాలధారణలతో కిటకిటలాడింది.

హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

- సంక్రాంతికి మూడు లక్షల పేదల గృహాలను పూర్తి చేయడమే లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలోనే 80 శాతానికిపైగా హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ శ్రేణులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రతీ ఇంటింటికి వెళ్లి జీఎస్టీ తగ్గింపు వల్ల అవుతున్న ఆదాను వివరించాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ త్వరలోనే ఇల్లు లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీశ్, షేక్ బాబర్, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్వహించాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో మంగవారం ధర్నా చేశారు. రింగు రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన చేస్తూ నెహ్రూచౌక్‌కు చేరుకున్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీపీ విధానాన్ని విరమించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు ఐడీ బాబు వైసీపీ నాయకులు పిల్లి అప్పారావు, మందపాటి జానకిరామరాజు, పి.నాగేశ్వరరావు, కేఎం నాయుడు, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేశ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎట్టకేలకు దోభీఖానాకు మోక్షం

సబ్బవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతపురం గ్రామంలో దోబీ ఖానా నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. సుమారు 20 ఏళ్ల క్రితం దీని నిర్మాణానికి అప్పటి నాయకులు నిధులు మంజూరు చేశారు. అరకొరగా నిధులు మంజూరు కావడంతో దోభీఖానా నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక నేతలు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ మేరకు అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంతో ఆరు నెలల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు.



ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన దోభీఖానా

ముత్తయిదువులకు వాయినాల పంపిణీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద మంగళవారం ముత్తయిదువులకు వాయినాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, మళ్ల జగ్గఅప్పారావు, మోహినిదేవి దంపతుల ఆర్థిక సాయంతో అధిక సంఖ్యలో తరలివచ్చిన ముత్తయిదువులకు నాయుడు, జగ్గఅప్పారావు దంపతులు వాయినాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరి కమిటీ, ప్రజా టెంట్‌హౌస్ కమిటీ, మరిడిమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముత్తయిదువులకు వాయినాలు అందిస్తున్న దాతలు

నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే జరిమానా


కొత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహ నాలు నిలిపితే జరిమానా విధిస్తామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. అనకాపల్లి మండలం పిసినికాడ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు జరిమానా విధించారు. అలాగే నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపిన వారికి రూ.1500 జరిమానా వేసినట్టు ఎస్ఐ చెప్పారు. వాహనాలకు సంబంధించి పక్కాగా రికార్డులు ఉండాలని సూచించారు. మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అక్టోబరు 7న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు చందోలు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక ఏపీటీఎఫ్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ధర్నాకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిలు చెల్లింపుల హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో ప్రతినిధులు బి.చిన్నారావు, శేఖర్, దుర్గాప్రసాద్, శాస్త్రి, శ్రీనివాసరావు, రాజేశ్, నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యుత్ అలంకరణలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం సతకంపట్టులోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. వన్‌వే ట్రాఫిక్ జంక్షన్, బాలకృష్ణ బస్టాప్, పరమేశ్వరిపార్కు జంక్షన్, సతకంపట్టు ప్రాంతాల్లో దేవతామూర్తుల ఆకారాల్లో విద్యుత్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీవీ రమణ ఆధ్వర్యంలో దసరా రోజున పూడిమడక రోడ్డులోని రామాలయం నుంచి నవదుర్గలతో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఇందుకోసం నెహ్రూచౌక్, ఎన్టీఆర్ జంక్షన్, చిననాలుగురోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, గవరపాలెం ఆలయానికి వెళ్లే మార్గంలో విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు.

అనకాపల్లి కూడళ్లలో ఏర్పాటు చేసిన సెట్టింగులు

బంగారం చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లోని బంగారం వస్తువు చోరీ జరిగిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... పూడిమడకరోడ్డులోని ఒక అపార్టుమెంట్‌లో అచ్యుతాపురం జడ్పీ హైస్కూల్‌లో టీచరుగా పనిచేస్తున్న విమలాదేవి నివాసం ఉంటున్నారు. సెప్టెంబరు 16న స్కూల్‌కు వెళ్తూ ఇంట్లో రెండున్నర తులాల నల్లపూసల బంగారం గొలుసు మరిచిపోయింది. సాయంత్రం చూసేసరికి దండ కనిపించలేదు. ఇంట్లో పని మనిషిపై అనుమానం వచ్చి మంగళవారం ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తుమ్మపాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మామిడిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మామిడిపాలెం గ్రామంలో బోగాది గణేశ్, లక్ష్మీ కుటుంబంతో నివసిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు బోగాది రాజేశ్ రైల్వేలో కాంట్రాక్టర్ వద్ద ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రాజేశ్ ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి యాప్‌ల ద్వారా రూ.4 లక్షలు అప్పు చేసి, తీర్చలేకపోతుండడంతో స్పామ్ కాల్స్ ద్వారా వేధింపులు ప్రారంభమయ్యాయి. చివరకు వాట్సాప్‌లో న్యూడ్ ఫొటోలను పంపించి కుటుంబీకుల ఫొటోలు సైతం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించడంతో రాజేశ్ మనస్థాపానికి గురై గడ్డి మందును తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చగా, ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. రాజేశ్ పరిస్థితి విషమంగానే ఉందని వారు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పరవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ పరిధిలోని ధర్మారాయుడుపేట ఇందిరమ్మకాలనీలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు సీసీ రహదారి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు వారు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోన రామారావు, కావలి రాజు, మొల్లి వెంకటరావు, కావలి వాసు, మోటూరు సత్య పాల్గొన్నారు.

మల్లోడిగెడ్డలో వ్యర్థ జలాలను తోడించాలి

పరవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరవాడ-భరణికం రోడ్డుకు ఆనుకుని ఉన్న మల్లోడిగెడ్డలో ఫార్మా వ్యర్థ జలాలను తోడించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా గెడ్డలో విడిచిపెట్టడంతో వాగు కలుషితమైందన్నారు. దీనివల్ల పరవాడ, భరణికం, తానాం, తాడి, ఈ.బోనంగి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాంకీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పూర్తి స్థాయి తహశీల్దార్‌ను నియమించరూ..

తుమ్మపాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో పూర్తి స్థాయిలో తహశీల్దార్‌ను నియమించాలని సీపీఐ నేత వైఎన్ భద్రం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో తహశీల్దార్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇన్‌చార్జి తహశీల్దార్‌గా వ్యవహరిస్తున్న డీటీ ప్రతి రోజూ హైకోర్టు పనులపై విజయవాడలో ఉండిపోవడంతో ఇక్కడ సమస్య ఉత్పన్నమవుతున్నదని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కులబీరు గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో రోగులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 30, (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులు సోకకుండా ఉంటాయని సర్పంచ్ పోర్తిమ్మ అన్నారు. మండలంలో గల జర్జుల పంచాయతీ కులబీరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్వస్థ్ నారీ.. సశక్త పరివార్ మెగా వైద్య శిబిరంను ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు వివిధ వ్యాధులతో బాధపడుతున్న 98 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. సీజన్ వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి శిరీష వివరించారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరాలు సోకితే వెంటనే ఆస్పత్రికిరావాలని కోరారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

చట్రాపల్లి వాసుల్లో వణుకు

- వర్షాలతో గ్రామస్థులకు నిద్ర కరవు
- గత ఏడాది తుఫాన్‌కు కొండచరియలు విరిగి పడిన ఘటనతో భయం..భయం
- అమలుకునోచని సురక్షిత ప్రాంతంలో కాలనీ నిర్మాణ హామీ

సీలేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని చట్రాపల్లి గ్రామస్థులు ఎడతెరపిలేని వర్షాలకు వణికిపోతున్నారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కంటిమీద కునుకులేకుండా భయాందోళలనతో గడిపినట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 8వతేదీన ఈ ప్రాంతంలో ఇదే తరహాలో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన జలప్రవాహానికి కొండచరియలు కొట్టుకువచ్చి గ్రామంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 70 మేకలు ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందాయి. ఈ సంఘటన గుర్తుకు వచ్చి సోమవారం రాత్రంతా గ్రామస్థులు భయంతో వణికిపోయినట్టు ఎంపీటీసీ బుజ్జిబాబు ఆందోళన వ్యక్తంచేశారు. గత ఏడాది సంభవించిన సంఘటన తర్వాత స్వయంగా పరిశీలించిన కలెక్టర్ చట్రాపల్లి గ్రామస్థులకు సురక్షిత ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులను ఆదేశించినా నేటికీ కార్యరూపం దాల్చలేద ఎంపీటీసీ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ గ్రామస్థులు కంటిమీద కునుకులేకుండావణికిపోతున్నారని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి త్వరితగతిన ఇళ్ళు నిర్మాణం చేసి ఇవ్వాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు.



కురిసిన భారీ వర్షానికి గ్రామంలోకి ప్రవహిస్తున్న వరద నీరు



గ్రామ సమీపంలోని కొండపైనుంచి మట్టితోపాటు వస్తున్న కాలువ ప్రవాహం

మద్దిగరువును మండలంగా ఏర్పాటు చేయాలి



టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరితో ఎంపీపీ అప్పలరాజు తదితరులు

జి.మాడుగుల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్దిగరువు పంచాయతీని మండల ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జీ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆమె స్వగృహంలో కలిసి మద్దిగరువు ప్రాంత సమస్యలపై వివరించారు. ఏవోబీకి ఆనుకొని ఉన్న మద్దిగరువు మండల ఏర్పాటుతో ఆ ప్రాంతం అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని గిడ్డి ఈశ్వరి హామీ ఇచ్చినట్లు వారు.తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండబాబు, టీడీపీ నాయకులు చిరంజీవినాయుడు, కె. రమేశ్, ఎ. శ్రీను పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించిన కలెక్టర్



జిల్లా కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ మంగళవారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలను చేపట్టారు. ముందుగా ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్య శాస్త్రి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన కార్యదర్శి కోటిబాబు నాయుడు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన నిధులను కేటాయించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నల్లా రామకృష్ణ, వెంకటరమణ, రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి మంగళసూత్రాలు బహూకరణ



అమ్మవారి మంగళ సూత్రాల అలంకరణలో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, దాతలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాదేవి ఆలయం లో కనకదుర్గమ్మకు విశాఖపట్నంనకు చెందిన భక్తుడు సుమారు 100 తు లాల వెండి మంగళసూత్రాన్ని మంగళవారం బహూకరించారు. గనివాడ రమేశ్, విజయలక్ష్మీ దంపతులు.. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతుల సమక్షంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు ఈ మంగళసూత్రం అందజేశారు. తొలుత మంగళసూత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి కి సమర్పించారు. దాత రమేశ్ మాట్లాడుతూ బంగారు పూతతో వెండి మంగళసూత్రాలను అందించినట్టు చెప్పారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా రమేశ్ దంపతులను ఘనంగా సన్మానించారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ డ్రైవర్‌గా పని చేస్తూ దుర్గమ్మకు మంగళసూత్రాలను బహుకరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుభాష్, ఆలయ కమిటీ ప్రతినిధులు రిటైర్డ్ ఉపాధ్యాయుడు సీహెచ్.ప్రసాదరావు, ఎ.మధుసూదన్, బి.దామోదరం, బి.శంకరరావు, ఎ.ప్రకాశ్, ప్రభాకర్, చైతన్యదాస్, నాగమ్మ, గుడ్ల శ్రీను, ఎన్.వసంత కిశోర్ పాల్గొన్నారు.

సిగినాపల్లి క్వారీపై 24గంటలు గస్తీ: డీఎఫ్‌వో



డీఎఫ్‌వో నరసింహారావు

చింతపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదవలస అటవీ శాఖ రేంజ్ పరిధి సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో బేస్ క్యాంప్, టాస్క్ ఫోర్సు సిబ్బందితో 24 గంటలు గస్తీ ఏర్పాటుచేసినట్టు స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) వైవీ నరసింహరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దసరా సమయంలో కొంత మంది వ్యాపారుల ప్రోత్సాహంతో కూలీలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు తవ్వకాలకు ప్రయత్నించే అవకాశమున్నందున అటవీశాఖ ఉద్యోగులను అప్రమత్తం చేశామన్నారు. సిగినాపల్లి కొండ సుమారు వెయ్యి అడుగుల ఎత్తు కలిగి ఉండడంతో ఆకస్మిక దాడులు సాధ్యం కావడంలేదన్నారు. ఈ మేరకు క్వారీ పర్యవేక్షణకు శాశ్వత బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం బేస్ క్యాప్, టాస్క్‌ఫోర్సు ఉద్యోగులు షిఫ్ట్‌ల వారీగా 24 గంటలూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. క్వారీ ప్రాంతాన్ని నిషేధించామని, తహసీల్దార్ సహకారంతో 163 సెక్షన్ అమలు చేస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే కొంత మంది వ్యాపారులపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. పోలీసులు కూలీలు, వ్యాపారులపై కేసులు నమోదయ్యాయన్నారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు నోటీసులు జారీ చేశామన్నారు. మరికొంత మంది వ్యాపారులపై బైండోవర్ కేసులు న మోదు చేస్తామన్నారు.

సమస్యలపై పీహెచ్‌సీ వైద్యులు నిరసన



ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పాడేరురూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న వైద్యుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీల వైద్యుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. సమస్యలపై నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఐటీడీఏ ఎదుట నిరసన చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీవో 99ని రద్దు చేసి ఇన్సూరెన్స్ కోటాను 30 శాతం, క్లినికల్ 50 శాతం, నాన్ క్లినికల్ అని డిపార్ట్‌మెంట్‌లో సీట్లు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులకు 30 శాతం బేసిక్ పే ట్రైబల్ అలవెన్స్ కల్పించాలని, టైమ్ బౌండ్ పదోన్నతులు కల్పించాలి, 2020 బ్యాచ్‌కు నోషనల్ ఇంక్రిమెంట్ కల్పించాలి, చంద్రన్న సంచార చికిత్స, అలవెన్స్ రూ. 4 వేలు, ఇతర ట్రైబల్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించేంత వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

జడ్పీ నిధులతో సీసీ రోడ్డు, రక్షిత నీటి పథకాలు



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ నిధులతో సీసీరోడ్డు, రక్షిత మంచి నీటి పథకాలు నిర్మిస్తున్నట్టు స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. మంగళవారం స్థానిక రామాలయం వీధిలో రూ.ఐదు లక్షల జడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకి స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ జడ్పీ నిధులతో మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సాయినగర్‌లో రూ. 10 లక్షలతో రక్షిత మంచి నీటి పథకం నిర్మిస్తున్నామన్నారు. సాడికపేట వీధిలో రక్షిత నీటి పథకానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయని, నిర్మాణ పనులు మరో పది రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల నిధులతో సామాజిక భవనం మరమ్మతులు, సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, కో ఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి, ఎస్సీ కాలనీ యువత, వార్డు సభ్యుడు బండారు నాయడు, ఏఎంసీ డైరెక్టర్ చిన్న పాల్గొన్నారు.

విశాఖ పోర్టు అథారిటీ సహకారంతో 3,500 మొక్కల పంపిణీ



ర్యాలీలో గిరిజన సంఘం కార్యదర్శి చిరంజీవి, పోర్టు ప్రతినిధులు

చింతపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అథారిటీ సహకారంతో మూడు గ్రామాల్లో ఆదివాసీలు 3,500 మొక్కలను పంపిణీ చేసినట్టు గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి తెలిపారు. మంగళవారం మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని వాముగెడ్డ, చీకటిమామడి, పినకొత్తూరు గ్రామాల్లో పోర్టు అథారిటీ, నవ నిర్మాణ సమితి ప్రతినిధులు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పోర్టు అథారిటీ అధికారులు నేరేడు, సపోటా, మామిడి, చింత, బాదం, సీతాఫలం మొక్కలను గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మొక్కలను పోర్టు అథారిటీ పర్యవేక్షణలో గిరిజన రైతులు పంట పొలాలు, పెరటిల్లో నాటారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఆదివాసీలకు పోర్టు అథారిటీ అధికారులు ఉచితంగా ఉద్యాన పంటల మొక్కలను పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు.ఈమొక్కలను ప్రజలు ప్రత్యేక శ్రద్ధతో పెంచుకుంటే రెండో విడత అదనపు మొక్కలను పోర్టు అథారిటీ అధికారులు అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో పోర్టు అథారిటీ ప్రతినిధులు సాంబమూర్తి, నవనిర్మాణ సమితి ప్రతినిధి కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు, భాస్కర్, సుదీన్, గ్రామస్థులు జి. లక్ష్మయ్య, పాపారావు, రాజారావు, రాజబాబు పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రిమూర్తులు

జి.మాడుగుల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని స్థానిక చైర్‌పర్సన్ టి.త్రిమూర్తులు పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సొసైటీలో రైతులను అన్ని విధాలుగా భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఇందులో భాగంగా నూతన సభ్యత్వాలు నమోదుకు చర్యలు చేపట్టానున్నట్టు చెప్పారు. మొండి బకాయిలు రికవరీ చేస్తామని అన్నారు. నూతన ఖాతాదారులు రుణాలు మంజూరు చేసేలా తీర్మానం చేశారు. ప్రభుత్వ పరంగా సబ్సిడీపై ఎరువులు, ఇతర వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కిముడు కల్యాణం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా సుబ్బారావు



డుంబ్రిగుడ, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డుంబ్రిగుడ మండల కేంద్రానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తుడుము సుబ్బారావుకు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా నియమించింది. ఆయన 1995లో టీడీపీ క్రియాశీలక సభ్యుడిగా చేరారు. 2015 నుంచి 2025 వరకు టీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన పనితీరును గుర్తించిన అధిష్టానం ఈ మేరకు సలహా మండలి డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తలను గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత, నారా లోకేశ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర, జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి జోలికి పోవద్దు: డీఎస్పీ షహబాజ్ అహ్మద్



మాట్లాడుతున్న పాడేరు డీఎస్పీ షహబాజ్ అహ్మద్

డుంబ్రిగుడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత గంజాయి జోలికి పోవద్దని పాడేరు డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ హెచ్చరించారు. మండంలోని పోతంగి పంచాయతీ కోసంగి గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంతో మంగళవారం గంజాయి వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, గంజాయి రవాణా చట్టరీత్యా నేరమని చెప్పారు. గంజాయి సాగు, మరికొంతమంది గంజాయి మత్తుకు బానిసై విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి సాగు, రవాణాలో కేసులు నమోదైతే అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వీటిపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలోస్థానిక ఎస్ఐ పాపినాయుడు సిబ్బంది, పాల్గొన్నారు.

దుర్గాదేవికి దీపార్చన

పాడేరురూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా పాడేరు మెయిన్ బజారులో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు దీపాలను వెలిగించారు. అయ్యప్పస్వామి ఆలయం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చేపట్టిన వెయ్యి దీపాల అర్చన చేపట్టారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్ని దేవ దేవుళ్ల ముంగిట దీపాలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదిత్య, వర్మ, దామో తదితరులు పాల్గొన్నారు.



పాడేరు అయ్యప్పస్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో మహాలక్ష్మి



దుర్గాదేవిగా రాజరాజేశ్వరి



మెయిన్ బజారులోని మండపం వద్ద దీపాలను అలంకరించిన మహిళలు

దుర్గాదేవిగా మహాలక్ష్మి, రాజరాజేశ్వరి దేవీలు

పాడేరులోని అయ్యప్పస్వామి ఆలయంలో మహాలక్ష్మి దేవి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి, కనకదుర్గమ్మ ఆలయంలో, మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన మండపం వద్ద దుర్గాదేవిలుగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి వందలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి దేవికి ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం వైదేహి దంపతులు పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో అర్చకులు రామన్ పంతులుకు అందించారు. అనంతరం కుంకుమాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి దేవికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న రత్నం వైదేహి దంపతులు



పాడేరు అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో మహాలక్ష్మికి దీపార్చనలో మహిళలు

అన్న సమారాధనలు



పెదబయలులో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పాడేరురూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు పర్యవేక్షణలో ఆలయ కమిటీ ప్రతినిధులు భవానీ మాలధారులు, సాధారణ భక్తులు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

పెదబయలు: స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద శ్రీ హరిహరపుత్ర మోటారు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం చేపట్టిన అన్నసమారాధనలో పలువురు నాయకులు, అధికారులు, వర్తకులు, మోటారు, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొని భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ చైర్మన్ సమరెడ్డి పూర్ణయ్య, స్థానిక ఎస్ఐ కొల్లి రమణ, మోటారు యూనియన్ నాయకులు చిట్టిబాబు, అంజిబాబు, శ్రీను, నాయకులు సింహాచలం, లైకోన్, వర్తకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభం రోజే హాజరుకావాలి: ఏటీడబ్ల్యూవో



ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి

చింతపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల తర్వాత పాఠశాల పునఃప్రారంభం రోజే విధిగా విద్యార్థులు హాజరుకావాలని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు దసరా సెలవులు అనంతరం అక్టోబరు 3వతేదీన పునఃప్రారంభం కానున్నాయన్నారు. సెలవులకు గృహాలకు వెళ్లిన విద్యార్థినీ, విద్యార్థులు తొలి రోజే పాఠశాలకు హాజరు కావాలన్నారు. అలాగే, పాఠశాలకు వచ్చిన వెంటనే విద్యార్థులకు వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్



కొయ్యూరులో పచ్చని తివాచి పరిచినట్టుగా కనిపిస్తున్న వరి చేలు

కొయ్యూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ఆశాజనకంగా దర్శనమిస్తున్నది. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో మండల వ్యాప్తంగా సుమారు రెండు వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పచ్చని తివాచీ పరినట్టుగా దర్శనమిస్తోంది. దీంతో రైతాంగం ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని ఆ శాభావం వ్యక్తంచేస్తున్నారు. అయితే, అక్కడక్కడ ఎర్ర తెగులు కనిపించినా, మొ త్తంగా చూస్తే.. అనుకూల వాతావరణ పరిస్థితులే కనిపిస్తున్నాయి.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

నర్సీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగవారం బాధితులకు అందజేశారు. నర్సీపట్నం మండలంలోని వేములపూడి గ్రామానికి చెందిన పసగడుగుల వెంకటేశ్ తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. అతని వైద్య ఖర్చులు కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.3,02,284 మంజూరు చేసింది. మంగళవారం క్యాంపు కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోళెం రాంప్రసాద్, లాలం శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

గొలుగొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకుంటామని చీడిగుమ్మల పీఏసీఎస్ చైర్మన్ బీమిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. చీడిగుమ్మల గ్రామంలో సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సొసైటీ ద్వారా నాలుగు కోట్ల రూపాయలను ఇప్పటివరకు రుణాలుగా అందించడం జరిగిందన్నారు. ఈ రుణాలను రైతులు తిరిగి చెల్లించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నందిపల్లి వెంకటరమణ, పైల స్వామినాయుడు, కొల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ దర్శనానికి భవానీ భక్తులు



విజయవాడ బయలు దేరిన మత్స్యపురం భవానీ భక్తులు

రావికమతం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షలు పూర్తిచేసుకున్న భక్తులు విజయవాడ శ్రీకనక దుర్గమ్మ దర్శనానికి బయలు దేరారు. మండలంలో కొమిర,మత్స్యపురం, చినపాచిల, గుమ్మాళ్ళపాడు, రావికమతం, గుడ్డిప, తట్టబంద, దొండపూడి, కొత్తకోట తదితర గ్రామాల్లో అర్థమండలం, నవరాత్రుల దీక్షలు పూర్తిచేసుకున్న భ వానీ భక్తులు అక్టోబరు 2న విజయవాడలో జరిగే దసరా ఉత్సవం రోజున శ్రీకనక దు ర్గమ్మ తెప్పోత్సవంలో పాల్గొని, అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుంటారు. ఈమేరకు విజయవాడకు బస్సులు, ఇతర వాహనాల్లో మంగళవారం ఉదయం బయలు దేరారు. అమ్మవారి దర్శనం అనంతరం దీక్ష విడిచి స్వగ్రామాలకు చేరుకుంటారు. విజయవాడకు బయలు దేరిన భవాని భక్తులను పీఠాల నుంచి ఊరేగింపుగా వెళ్లారు.

అక్షర గురువులు.. డ్వాక్రా మహిళలు

నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాల్లో 861 మంది విద్యా వలంటీర్లు

రెండు మునిసిపాలిటీల్లో 8,607 మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు గుర్తింపు

వంద రోజుల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి లక్ష్యం

ప్రతిష్టాత్మకంగా అక్షర అంధ్రా (ఉల్లాస్) అక్షరాస్యతా కార్యక్రమం



నర్సీపట్నం మునిసిపాలిటీలో విద్యా వలంటీర్లుగా నియమితులైన మహిళలు

నర్సీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం మెప్మా పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో చదవడం, రాయడం రాని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి తోటి డ్వాక్రా మహిళలు విద్యా వలంటీర్లుగా సేవలు అందించడానికి ముందుకు వచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు చదవడం, రాయడం రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సంతకం కూడా పెట్టడం రాని మహిళలు చాలా మంది ఉన్నారు. ఫలితంగా డ్వాక్రా సంఘాల లావాదేవీలు తెలియక ఒక్కొక్కసారి మోసపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డ్వాక్రా సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయడానికి ప్రభుత్వం అక్షర అంధ్రా(ఉల్లాస్) అక్షరాస్యతా కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా సర్వే చేపట్టి డ్వాక్రా మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించారు. వారికి చదవడం, రాయడం నేర్పించడానికి అదే డ్వాక్రా సంఘాల్లో పదో తరగతి, ఆపైన చదువుకున్న మహిళలను విద్యా వలంటీర్లుగా ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి అక్షరమాల, వ్యాకరణం పుస్తకాలు అందజేశారు.

పది మంది నిరక్షరాస్యులకు ఒక విద్యా వలంటీర్ చొప్పున నియమించారు. వీరు రోజు ఒక గంట చొప్పున వంద రోజులు పాటు నిరక్షరాస్యులకు అక్షరాలు రాయడం, చదవడం నేర్పించాలి. తదనంతరం విద్యా వలంటీర్‌తో పాటు అక్షరాస్యులైన డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ధ్రువపత్రాలను అందజేస్తుంది.

నర్సీపట్నం, ఎలమంచి మునిసిపాలిటీలలో ప్రత్యేక సర్వే ద్వారా 8607 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి చదువు చెప్పడానికి 861 మంది విద్యా వలంటీర్లను ఎంపిక చేశారు. నర్సీపట్నం మునిసిపాలీలో 4,600 మంది నిరక్షరాస్యులకు 461 మంది విద్యా వలంటీర్లను నియమించారు. ఎలమంచిలి మునిసిపాలిటీలో 39998 మంది నిరక్షరాస్యులకు 400 మంది విద్యా వలంటీర్లు పాఠాలు బోధిస్తారు. దసర తర్వాత ఉల్లాస్ అక్షర అంధ్రా వయోజన విద్య కార్యక్రమంలో మొదలవుతుందని మెప్మా సీవో రమాదేవి తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు



చీడికాడలో దుర్గాదేవిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

చీడికాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాలకన్నా అన్నదానం ఎంతో గొప్పదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక దుర్గాకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దర్గాదేవి పీఠాన్ని ఆయన మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు, మాజీ సర్పంచ్ యర్రా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు, పేరపు అప్పారావు, దుర్గాదేవి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్లకు గిరాకీ

కిలోన్నర కోడి రూ.1200 నుంచి రూ.1400కు అమ్మకం

» నాటుకోళ్లు, పొట్టేళ్ల విక్రయాలతో మేడివాడ వారపు సంత రద్దీ



రైతుల నుంచి నాటుకోళ్లను కొనుగోలుచేస్తున్న వ్యాపారులు



రైతుల నుంచి కొనుగోలు చేసిన కోళ్లను తీసుకు వెళుతున్న విశాఖకు చెందిన వ్యాపారి



కొనుగోలుదారులతో కిక్కిరిసిన మేడివాడ వారపు సంత



అమ్మకానికి తీసుకొచ్చిన పొట్టేళ్లు

రావికమతం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతకు అధిక సంఖ్యలో కొనుగోలు దారులు వచ్చి నాటుకోళ్లను కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. దీంతో నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. దసరా పండుగ నేపథ్యంలో వారపు సంత నాటు కోళ్ల, పొట్టేళ్లతో నిండిపోయింది. అనకాపల్లి, విశాఖపట్నం, తుని, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వ్యాపారులతోపాటు పరిశ్రమల నిర్వాహకులు, వాహన యజమానులు రావడంతో నాటుకోళ్ల, పొట్టేళ్లకు గిరాకీ పెరిగింది. రైతులు సంతకు తెచ్చిన కోళ్లను కిందకు దించకుండానే వ్యాపారులు కొనుగోలు చేసేశారు. దీంతో సాధారణ రోజుల్లో కిలో, కిలోన్నర రూ.700 నుంచి రూ.800 ఉండే నాటుకోడి మంగళవారం రూ.1200 నుంచి రూ.1400 పలికింది. నాలుగు, ఐదు కిలోల పుంజైతే రూ.5 వేలు నుంచి రూ.6 వేల వరకు అమ్ముడైంది. పొట్టేలు అయితే కిలో రూ.వెయ్యి వరకు ధర పలికింది. గొర్రెల కంటే నాటు కోళ్లకే డిమాండ్ పెరిగింది. కొనుగోలు దారులు అధిక సంఖ్యలో రావడంతో నాటుకోళ్ల, పొట్టేళ్లకు ఎక్కువ ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అగ్నిగుండంలో నడిచిన భవానీ భక్తులు



నాతవరంలో భవానీ భక్తులు నడవటానికి ఏర్పాటు చేసిన అగ్నిగుండం

నాతవరం సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శక్తిపంచాయతన ఆలయ ప్రాంగణంలో కనకదుర్గ ఆలయం వద్ద భవానీ భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి సతీశ్ ఏర్పాటు చేసిన అగ్నిగుండం కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది అలాగే బుధవారం ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బంగారం చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగారం వస్తువు చోరీ జరిగిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... పూడిమడకరోడ్డులో అచ్యుతాపురం జడ్పీ హైస్కూల్‌లో టీచరుగా పనిచేస్తున్న విమలాదేవి నివాసం ఉంటున్నారు. సెప్టెంబరు 16న స్కూల్‌కు వెళ్తూ ఇంట్లో రెండున్నర తులాల నల్లపూసల బంగారం గొలుసు మరిచిపోయింది. సాయంత్రం దండ కనిపించలేదని చేసిన ఫిర్యాదుపైకేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

ప్రైవేటు బ్యాంకులకు దీటుగా పీఏసీఎస్ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బాబులునాయుడు

రోలుగుంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు బ్యాంకులకు దీటుగా స్థానిక పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని నూతన ఛైర్‌పర్సన్ సుర్ల బాబులునాయుడు పేర్కొన్నారు. మంగళవారం పీఏసీఎస్‌లో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో 4096 మంది సభ్యులు ఉన్నారని వారి వాటా ధనం రూ.1,71,34,300 బ్యాంకులో ఉందన్నారు. 2024-25 ఆడిట్ రిపోర్టు ప్రకారం సంఘం మొత్తం ఆదాయం రూ.2.4 కోట్లు, నికర ఆదాయం రూ.33లక్షలతో సొసైటీ 'ఏ' గ్రేడ్‌లో ఉందన్నారు. పీఏసీఎస్ మొత్తం రూ.22 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తుందని, వచ్చే ఏడాదికి రూ.30 కోట్లకు పైగా టర్నోవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. సొసైటీ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో దుకాణాలు నిర్మించి అవసరమైన వారికి అద్దె ప్రాతిపదిక ఇవ్వడానికి నిర్ణయించినట్టు ప్రకటించారు. అవసరమైన రైతులకు రూ.1లక్ష నుంచి రూ.10లక్షల వరకు సొసైటీలోనే రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. రాయితీపై ఎరువులు, విత్తనాలందించి అండగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బుంగా అప్పారావు, యర్రంశెట్టి వెంకటరమణ, సొసైటీ సీఈఓ మహేష్, మండల టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పంచాడ చంద్ర, గుములూరు చంద్రమౌళి, సభ్యరైతులు పాల్గొన్నారు.

మేడివాడ పీఏసీఎస్‌ని నష్టాలనుంచి గట్టెక్కించాలి

» పర్సన్ ఇన్‌చార్జి గుటాల చిన్న



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి చిన్న

రావికమతం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నష్టాల ఊబిలో ఉన్న మేడివాడ సహకార సంఘాన్ని బయట పడేందుకు ఉన్నతాధికారులతో పాటు రైతులు, సంఘ సిబ్బంది సహాయ సహకరించాలని పర్సన్ ఇన్‌చార్జి గుటాల చిన్న కోరారు. ఈ సంఘ కార్యాలయంలో మంగళవారం సర్వ సభ్య సమావేం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఏసీఎస్‌లో 2,777 మంది సభ్య మెంబర్లలో వెయ్యి మంది మాత్రమే లావాదేవీలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సంఘంలో ఉన్న మొండి బకాయిలతో ప్రస్తుతం రూ. కోటికి పైగా నష్టాల్లో ఉందన్నారు. 8 కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతున్న సంఘం నష్టాల్లోనే ఉండటం దురదృష్టకరమన్నారు. మొండి బకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శేషుబాబు, టీడీపీ నాయకులు రాంబాబు, త్రీమేన్ కమిటీ సభ్యులు, సీఈఓ గొర్లె శ్రీనివాసరావు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. ఉదయం పదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కాస్తా ఎండ కాసింది. ఆ తరువాత వాతావరణం మారి తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది.

దుర్గాదేవిగా శ్రీదుర్గమ్మ

రావికమతం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట గ్రామంలోని దుర్గా దేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం శ్రీదుర్గా దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు వేపా రామకృష్ణ కిశోర్ చక్కెర పొంగలిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామస్థులే కాకుండా పరిసరాల్లోని దొండపూడి, కన్నంపేట, మర్రివలస, వమ్మవరం, గంపవానిపాలెం, జెడ్. కొత్తపట్నం తదితర గ్రామాల భక్తులు, అమ్మవారిని దర్శించుకున్నారు.



దేవరాపల్లిలో కుంకుమ పూజల్లో మహిళలు

చీడికాడ: శ్రీమహాదుర్గా అవతారంలో అప్పలరాజుపురం దేవిమెట్టపై వెలసిన లలితాదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల భక్తులుఅర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు.



కొత్తకోటలో దుర్గా దేవిగా దర్శనమిచ్చిన శ్రీదుర్గమ్మ



చీడికాడలో అమ్మవారు

ఉమామహేశ్వరీ దేవికి లక్ష కుంకుమ అర్చనలు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరీ దేవీ ఆలయంలో దుర్గాష్టమి పురస్కరించుకుని మంగళవారం అమ్మవారిని దుర్గాదేవీ మహంకాళి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలతో లక్ష కుంకుమార్చన పూజ అర్చకుడు ప్రకాష్ శర్మ చేయించారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితా ప్రసాద్ పాల్గొన్నారు.

బుచ్చెయ్య పేట: మండలంలోని రాజాంలో జరిగిన దుర్గష్టమి వేడుకల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమమలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, మరిశా సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

రావికమతంలో చెత్త తొలగింపు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

రావికమతం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌కు ఎదుట ఉన్న పంచాయతీ యార్డులోని చెత్తను వారం రోజుల వ్యవధిలో వేరొక చోటకు తరలిస్తామని డిప్యూటీ ఎంపీడీవో సీతారామ స్వామి తెలిపారు. ఈ చెత్త సమీపంలోని తట్టబంద రోడ్డుపైకి వచ్చి రాకపోకలకు ఇబ్బందితో పాటు హైస్కూల్ విద్యార్థులు, తహసీల్దార్, ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్లకు వెళ్లే వారు, ఎస్సీ కాలనీ వాసులు ఇ బ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై 'స్వచ్ఛతా నహీ సేవా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై డీపీవో స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీవో , కార్యదర్శి కృష్ణమోహన్ ఇక్కడ పేరుకున్న చెత్త కుప్పలను ఎక్స్‌కవేటర్‌తో మీ సేవ కేంద్రం వెనక భాగంలో తాత్కాలింగా వేయించారు. శాశ్వత డప్పింగ్ యార్డుకు స్థలం లేనందున ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ చెత్తను కాపులుప్పాడ విద్యుత్ తయారీ కేంద్రానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తెలిపారు. అలాగే, గ్రామంలో మిగిలిన చోట్ల చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రచారం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచారాన్ని ఇంటింటికీ తీసుకు వెళ్లాలని ఎమ్మెల్యే బండారు.సత్యానా రాయణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక రైవాడ అతిథిగృహంలో ఈ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో వ చ్చిన పన్ను తగ్గింపుతో ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అక్టోబరు 19 వరకు ఈ ప్రచారం సాగించాలన్నారు. ముందుగా రైవాడ జలాశయం ఆనుకుని ఉన్న ఎరకాలమ్మ గుడి వద్ద దుర్గమ్మ ప్రతిమను దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు సత్యారావు, మహేశ్వరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హరియాణా గేదెల కొనుగోలుకు రుణ సహకారం

చోడవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలదిగుబడి ఎక్కువగా ఇచ్చే హరియాణా గేదెల కొనుగోలుకు సంబంధించి విశాఖ డెయిరీ రుణ సహకారం అందిస్తుందని డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక డెయిరీ జోనల్ కార్యాలయంలో పాడిరైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాడి రైతులు పాల దిగుబడి, పాలలో నాణ్యత పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డెయిరీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఇటీవల సహజ మరణం పొందిన పాడిరైతుల నామినీదారులకు బీమా చెక్కులతో పాటు, పాడి పశువుల బీమా చెక్కులను రైతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ యూనిట్ మేనేజర్ రాము, పాలసంఘాల అధ్య క్షులతో పాటు, పాలకవర్గ సభ్యులు వేతన కార్యదర్శులు పాడి రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దాణా బేసిన్లు పంపిణీ

దేవరాపల్లి: మండలంలోని బి.కింతాడలో విశాఖ డె యిరీ పాడి రైతులకు దాణా బేసిన్లను డైరెక్టర్ సుందరపు గంగాధర్, పాలసంఘం అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, సర్పంచ్ బాబూరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులకు విద్య, వైద్యం, బీమా, బోనస్ తదితర సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పాడి రైతులకు బీమా చెక్కులు అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ పవన్‌కుమార్

పూర్వ విద్యార్థుల విరాళం



విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల దేవీ అమ్మవారి ఆలయం గోపుర నిర్మాణానికి పూర్వ విద్యార్థులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. స్థానిక ఆర్‌సీఎం, జడ్పీహైస్కూల్‌లో చదువుకున్న 1999-2000 పదో తరగతి విద్యార్థులు రూ. 28వేలు విరాళంగా మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దంగేటి సూర్యారావు, ఎస్.వి. రావు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరాజు, ప్రసాద్, ఆటోమోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



ప్రచార కరపత్రం ఆవిష్కరిస్తున్న ఏపీఎం

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కరపత్రాలను మంగళవారం సానిక ఐకేపీ భవనంలో డ్వాక్రా మహిళలతో కలసి ఏపీఎం రాజుబాబు ఆవిష్కరించారు. నూతన జీఎస్టీ విధానంపై డ్వాక్రామహిళలకు అవగాహన కల్పించారు. రోజు వారి ఉపయోగించే పలు వస్తువులపై జీఎస్టీ తొలగించారన్నారు. 99 శాతం వస్తువుల పన్ను రహితం చేసినట్టు చెప్పారు.పేద, మధ్య తరగతి కుటుంబాలకు డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తుమ్మపాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మామిడిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మామిడిపాలెం గ్రామంలో బోగాది గణేశ్, లక్ష్మీ కుటుంబంతో నివసిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు బోగాది రాజేశ్ రైల్వేలో కాంట్రాక్టర్ వద్ద ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రాజేశ్ ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి యాప్‌ల ద్వారా రూ.4 లక్షలు అప్పు చేసి, తీర్చలేకపోతుండడంతో స్పామ్ కాల్స్ ద్వారా వేధింపులు ప్రారంభమయ్యాయి. చివరకు వాట్సాప్‌లో న్యూడ్ ఫొటోలను పంపించి కుటుంబీకుల ఫొటోలు సైతం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించడంతో రాజేశ్ మనస్థాపానికి గురై గడ్డి మందును తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పగా, ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. రాజేశ్ పరిస్థితి విషమంగానే ఉందని వారు తెలిపారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.



శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా జై హనుమాన్ రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

ప్రైవేటుకు గనుల సీనరేజీ కాంట్రాక్టు

- రెండేళ్లకు రూ.432.43 కోట్లు చెల్లించేందుకు
- ముందుకు వచ్చిన ఏఎంఆర్ కంపెనీ
- కేసులు రాయడానికి పరిమితం కానున్న గనుల శాఖ

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గనుల సీనరేజీ వసూలు బాధ్యతను ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. రెండేళ్లకు రూ.432.43 కోట్లు చెల్లించేందుకు ముందుకొచ్చిన ఏఎంఆర్ కంపెనీకి టెండర్ దక్కింది. సగటున నెలకు రూ.36 కోట్లు వంతున చెల్లించాల్సి ఉంటుంది. ఇకఅక్రమ క్వారీయింగ్ చేసే వారిపై దాడులు చేసి కేసులు రాయడానికి మాత్రమే గనుల శాఖ పరిమితం కానున్నది.

ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు విశాఖపట్నంలో డీడీ, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరుల్లో ఏడీ కార్యాలయాలు ఉన్నాయి. ఏటా జిల్లా నుంచి గనుల శాఖకు సుమారు రూ.200 కోట్ల ఆదాయం (గ్రానైట్, లేటరైట్, బ్లాక్ మెటల్, గ్రావెల్ క్వారీల ద్వారా) సమకూరుతుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా సీనరేజీ వసూలు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను రెండు కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించారు. విశాఖ జిల్లాకు సంబంధించి అప్పట్లో వైసీపీ నాయకులు అంగీకరించకపోవడంతో టెండర్లు పిలవలేదు. కూటమి వచ్చిన తరువాత విశాఖ జిల్లాకు టెండర్లు ఆహ్వానించగా ఈ నెలలో ఖరారు చేశారు. రెండేళ్లలో రూ.432.43 కోట్లు అంటే ఏడాదికి రూ.216.21 కోట్లు వంతున ప్రభుత్వానికి చెల్లించేలా టెండరు ఖరారుచేశారు.

గనుల శాఖలో సిబ్బంది తక్కువగా ఉన్నారు. లీజులు మంజూరు, అప్పుడప్పుడు తనిఖీలకు మాత్రమే పరిమితమవుతున్నారు. అంతేతప్ప అక్రమ క్వారీయింగ్‌ను, పర్మిట్లు లేకుండా సాగుతున్న రవాణాను అరికట్టలేకపోతున్నారు. నర్సీపట్నం పరిధి నాతవరం మండలంలో లేటరైట్ తవ్వకాలపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అక్కడ తవ్విన దానికి ప్రభుత్వానికి చెల్లించే సీనరేజీకి మధ్య భారీ తేడా ఉంది. రూ.కోట్లలో ఆదాయం కోల్పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే అనకాపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా పలువురు మెటల్ తవ్వుకుంటున్నారు. ఇంకా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వాటికి ఎటువంటి పర్మిట్లు లేవు. ఈ నేపథ్యంలో గ్రావెల్ నుంచి లేటరైట్ వరకూ ప్రతి దానికీ సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. ఆ కంపెనీ సొంతంగా మనుషులను నియమించుకుంటుంది. పర్మిట్లు లేకపోతే వాహనాలను గనుల శాఖకు అప్పగిస్తుంది. ఆ తరువాత జరిమానా వసూలు చేసే బాధ్యత ప్రైవేటు కంపెనీ తీసుకుంది. రెండు, మూడు రోజుల్లో ప్రైవేటు కంపెనీకి ఈ బాధ్యత అప్పగించనున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

మందకొడిగా డిగ్రీ ప్రవేశాలు

... 3వ పేజీ తరువాయి

కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కళాశాలలో కోర్సుల వారీగా వున్న సీట్లు, భర్తీ అయినవి, ఖాళీలకు సంబంధించి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య తెలిపిన వివరాలిలా వున్నాయి. బీఎస్సీ (కెమిస్ట్రీ)లో 55 సీట్లకు 45 భర్తీ అయ్యాయి. బీఎస్సీ (మ్యాథ్స్)లో 40 సీట్లకు 19, బీఎస్సీ (జువాలజీ)లో 40 సీట్లకు 15, బీఎస్సీ (బోటనీ)లో 40 సీట్లకు 13, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్)లో 60 సీట్లకు 49, బీఏ (హిస్టరీ)లో 40 సీట్లకు 9 భర్తీ అయ్యాయి. మొత్తం 150 సీట్లు నిండగా, ఇంకా 105 సీట్లు ఖాళీగా వున్నాయి.

సబ్బవరంలో 60 శాతం సీట్లు భర్తీ

సబ్బవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం డిగ్రీల్లో కోర్సుల్లో 60 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. బీఏ, బీఎస్సీ, బీకాంలో మొత్తం 290 సీట్లు వుండగా, 173 సీట్లు భర్తీ అయ్యాయి. బీఎస్సీ (ఫిజిక్స్)లో 40 సీట్లకుగాను ముగ్గురు మాత్రమే చేరారు. బీఎస్సీ (బోటనీ) 50 సీట్లకు 13 మంది, బీఎస్సీ (కెమిస్ట్రీ)లో 40 సీట్లకు 36 మంది, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)లో 50 సీట్లకు 43 మంది, బీఏ (హిస్టరీ)లో 40 సీట్లకు 29 మంది, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్)లో 70 సీట్లకు 49 మంది చేరారు. ఇంకా 117 సీట్లు ఖాళీగా వున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ తెలిపారు.

చోడవరంలో సగానికిపైగా సీట్లు ఖాళీ

చోడవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో మొత్తం 260 సీట్లు వున్నాయి. మొదటి విడత ప్రవేశాల్లో 124 సీట్లు భర్తీ అయ్యాయి. బీఎస్సీ కంప్యూటర్స్ మినహా మిగిలిన కోర్సుల్లో చాలా వరకు సీట్లు భర్తీ కాలేదు. బీఏ (ఎకనామిక్స్)లో 60 సీట్లకు 11, బీకాంలో 60 సీట్లకు 32, బీఎస్సీ (జువాలజీ)లో 60 సీట్లకు 16, బీఎస్సీ (కెమిస్ట్రీ)లో 40 సీట్లకు 26, బీఎస్సీ (కంప్యూటర్స్) 40 సీట్లకు 39 భర్తీ అయ్యాయి.

మాడుగులలో 17.3 శాతం సీట్లు మాత్రమే భర్తీ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపుల్లో మొత్తం 260 సీట్లు వుండగా, తొలి విడత 45 సీట్లు (17.3 శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. బీఎస్సీ (మేథ్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్) 40 సీట్లకు 13 మంది, బీఎస్సీ (బోటనీ) లో 40 సీట్లకు నలుగురు, బీఎస్సీ (జువాలజీ)లో 40 సీట్లకు నలుగురు, బీకాం కంప్యూటర్స్‌లో 60 సీట్లకు 13 మంది, బీఏ హిస్టరీలో 40 సీట్లకు 11 మంది మాత్రమే చేరారు. బీఏ పొలిటికల్ సైన్స్ గ్రూపులో ఒక్కరు కూడా చేరలేదు.

ఎలమంచిలిలో ఆశాజనకంగా ప్రవేశాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ఒకింత ఆశాజనంగానే వున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మొత్తం 275 సీట్లకుగాను 175 మంది ప్రవేశాలు పొందారు. మరో వంద సీట్లు ఖాళీగా వున్నాయి.

ఏఎంఏఎల్ కళాశాలలో...

కొత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక ఎయిడెడ్ కళాశాల అయిన అనకాపల్లి ఏఎంఏఎల్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం బికాంలో 240 సీట్లు, బీఎస్సీలో 350 సీట్లు వున్నాయి. మొదటి విడతలో మొత్తం 590 సీట్లకుగాను 173 మంది మాత్రమే చేరారు. బీకాంలో 16 మంది, బీఎస్సీ బోటనీలో 14 మంది, కెమిస్ట్రీలో 46 మంది, సీఎస్‌సీలో 34 మంది, కెమిస్ట్రీ (సెల్ఫ్ ఫైనాన్స్)లో 14 మంది, అగ్రికల్చర్ ఒకేషనల్‌లో 11 మంది, డీఏహెచ్ ఒకేషనల్‌లో 38 మంది చేరారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. ఇంకా 417 సీట్లు అందుబాటులో వున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎలమంచిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిబంద జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ కె.సావిత్రి అందించిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున అనకాపల్లి వైపు నుంచి తుని వైపు నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని, వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి 35 నుంచి 40 ఏళ్లు వుంటాయని, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



